క్లుప్తంగా

హిజ్రాకు వేధింపులు

తెనాలిరూరల్: హిజ్రాకు ఫోన్‌లు చేసి అసభ్యంగా దూషించడంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణానికి చెందిన ఓ హిజ్రాకు కొంత మంది వ్యక్తులు ఫోన్‌లు చేసి అసభ్యంగా మాట్లాడుతూ దూషిస్తున్నారు. దీనిపై సదరు హిజ్రా శనివారం పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

పింఛన్ల పంపిణీ

తెనాలిఅర్బన్: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారంతో ముగిసింది. పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు మొదటి రోజు అందుబాటులోలేని పింఛన్‌దారులకు కలిసి వాటిని పంపిణీ చేశారు. తెనాలి పట్టణంలో సుమారు 98శాతం పింఛన్లు పంపిణీ పూర్తయినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఘనంగా గోమాతకు అంత్యక్రియలు



తాడేపల్లి రూరల్ : మంగళగిరి మండల పరిధిలోని రామచంద్రాపురంలో గోమాతకు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ లంకిరెడ్డి శేషిరెడ్డి గత 38 ఏళ్లుగా గోవును పోషిస్తున్నారని తెలిపారు. తన జీవిత కాలంలో 17 సార్లు ఈనినట్లు పేర్కొన్నారు. రామచంద్రాపురం పరిసర ప్రాంతాల్లో దేవత ప్రతిష్ఠలు, గృహ ప్రవేశాలకు తీసుకు వెళ్లేవారని తెలిపారు. గోమాతకు పూజలతో, బాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించి భూస్థాపితం చేసినట్లు చెప్పారు.

ఆశీలును రద్దు చేయాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశీలను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర చేతి వృత్తిదారుల సంఘం నాయకులు కంచర్ల కాశయ్య డిమాండ్ చేశారు. తాడేపల్లిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో చేపల విక్రయదారుల వద్ద వారానికి యాభై రూపాయలు వసూలు చేశారని, అప్పటి శాసన సభ్యులు దాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ ఆశీల రద్దును కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే, ఇప్పుడు రూ. 100 వసూలు చేయడంతో వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించి ఆశీలను రద్దు చేయాలని ఆయన కోరారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

మంగళగిరి: నగరంలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు కమిషనర్ ఆలీం బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ, 6వ నెల 2025కు ముందు వేసిన లేఅవుట్లను 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు. నాన్ లే అవుట్లు ప్లానులు తయారు చేయించుకుని 50శాతం లేదా రూ. పది వేలు తగ్గకుండా చెల్లించి 90 రోజుల్లో యాజమాన్యపు హక్కులు పొందాలని తెలిపారు. ఖాళీ స్థలాలకు వెంటనే పన్నులు చెల్లించాలని కోరారు.

రాచకొండ విశ్వనాథ శాస్త్రికి నివాళి

లక్ష్మీపురం: మూడు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యంలో ఎన్నో మేలి పంటలు పండించిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనల నిండా సమాజ హృదయం ఉంటుందని, ఆయన సిసలైన ప్రజా రచయిత అని ప్రముఖ విశ్లేషకులు అవధానుల హరి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన మనమూ పాడుదాం రండి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కళాసాధ అధ్యక్షులు బిళ్ళా అశోక్, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, కవి వి.వి.రావ్, రచయిత జమదగ్ని పాల్గొన్నారు.

గిగ్ వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం: స్విగ్గి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు కోరారు. గుంటూరు లాడ్జిసెంటర్‌లో స్విగ్గీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పే-ఔట్ విధానానికి కొత్త విధానానికి సగానికి సగం వేతనం కోత విధించబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇన్సెంటివులు రద్దు చేశారని, అనారోగ్యం , బంధువులు మరణించినా ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులు రెండు రోజులు డ్యూటీ ఆఫ్ అయితే వారి ఐడీలు బ్లాక్ చేస్తున్నారని అన్నారు. డ్యూటీ ఆఫ్ అయితే ఎలాంటి వేతనం చెల్లించని స్విగ్గీ సంస్థ వారి ఐడీలు బ్లాక్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సంస్థ యాజమాన్య ప్రతినిధులు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అందువలన మూడు రోజుల నుండి స్విగ్గీ కార్మికుల సమ్మె చేస్తున్నారని, వెంటనే సమస్యలు పరిష్కారానికి యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. అంజిరెడ్డి, షేక్ జబీర్, బి. హిమ శ్యామ్ సింగ్ పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు
- కొల్లిపర సీహెచ్‌సీలో తనిఖీలు



కొల్లిపర సీహెచ్‌సీలో వైద్య సేవలు, వైద్యుల పనితీరు గురించి రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ రంగారావు

కొల్లిపర: వైద్యులు, వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా సమన్వయ ఆరోగ్య శాఖాధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ రంగారావు అన్నారు. మండలకేంద్రం కొల్లిపర గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రోగులకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. వార్డులో ఉన్న రోగులను డాక్టర్లు, సిబ్బంది పనితీరు ఎలా ఉంది.. మందులు అన్నీ ఇస్తున్నారా? లేదా? బయటకు ఏమైనా రాస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఆరోగ్య శ్రీ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలకు జనరల్ సర్జన్‌ను నియమించాల్సి ఉందని, ఒక నెలలోపు నియామకం జరుగుతుందన్నారు. రాత్రిళ్లు వైద్యులు తప్పనిసరిగా ఉండి అత్యవసరమైన సేవలు అందించాలని సూచించారు. సీహెచ్‌సీకి ఎక్స్‌రే, బ్లడ్ బ్యాంక్ స్టోరేజీ ఈ రెండు సేవలు మరో సుమారు 30 రోజుల్లో ప్రారంభించి రోగులకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

బయటకు రాస్తే ఫిర్యాదు చేయండి

వైద్యశాలల్లో ఎటువంటి మందులు కొరత లేదని, ఎవరైనా మందులు బయటకు రాసినా, లేవు అని చెప్పిన వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇక నుంచి ప్రతి వైద్యానికి ఆరోగ్య శ్రీ లో నమోదు చేయటం జరుగుతుందన్నారు. దీంతో మందులు కొరత వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటుందన్నారు. వైద్యశాలకు వచ్చే రోగులకు ఆధార్, ఆరోగ్య శ్రీ కార్డు వారి వెంట తీసుకువచ్చే విధంగా వైద్యులు ప్రతి రోజులో వారి వద్దకు వచ్చే రోగులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా సీహెచ్‌సీ కాన్పులు తక్కువగా నమోదు అవుతున్నాయని, ఇక నుంచి ఎక్కువ శాతం నమోదయ్యేవిధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ రోజు తన ఆధ్వర్యంలో ముగ్గురికి ఆపరేషన్ ద్వారా కాన్పులు చేసినట్లు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణి, వైద్యులు సుప్రియ, గంగాధర్, అనూష, హెడ్‌నర్స్ కె.సుజాత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ దుర్వినియోగం చేస్తే చర్యలు

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్వా యేసుబాబు



మాట్లాడుతున్న డాక్టర్ యేసుబాబు

తెనాలిఅర్బన్: మున్సిపల్ వాహనాలకు డీజిల్ పట్టించే విషయంలో సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్వా యేసుబాబు సూచించారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలోని మున్సిపల్ వాహనాల డ్రైవర్లతో శనివారం ఐతానగర్‌లోని వెహికల్ షెడ్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ దుర్వినియోగం అవుతుందనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, అలాంటివి జరగకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా డీజిల్ అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే సహించేది లేదన్నారు. విధుల నుంచి తొలగించడానికి కూడా వెనుకడబోమని హెచ్చరించారు. అందరూ అప్రమత్తంగా ఉంటూ డీజిల్ విషయంలో ఎక్కడా అక్రమాలు జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు



పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి బ్రోచర్ అందజేస్తున్న గాది సుబ్బారెడ్డి

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నట్లు బాధ్యులు గాది సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలల్లో హెచ్‌ఎంలకు బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 10వ తేదీ ఆదివారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అమరావతి ఐకాన్‌లో చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 3,4,5 తరగతుల వారిని సబ్ జూనియర్‌గా, 6,7 తరగతుల వారిని జూనియర్‌గా, 8,9,10 తరగతుల వారిని సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహిస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు ఈనెల 7వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. పోటీ కేంద్రంలో కేవలం డ్రాయింగ్ షీటు మాత్రమే అందజేస్తామని, మిగిలిన సామగ్రిని విద్యార్థులే తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవ బాధ్యులు ఎం. మనోహర్ రెడ్డి, బిట్రా రామారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

- జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు
- ఓ హోటల్ సీజ్‌కు ఆదేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పార్కింగ్ లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే హోటల్స్, రెస్టారెంట్లు, టీ, టిఫిన్ స్టాళ్లపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం శ్రీకృష్ణదేవరాయ నగర్, భాగ్యనగర్, తుఫాన్ నగర్, పెద్ద పలకలూరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల వలన ట్రాఫిక్ సమస్య రాకుండా ఇప్పటికే రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లోని రవి క్రేజీ ఫుడ్స్‌ని తక్షణం సీజ్ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. స్తంభాలగరువు, భాగ్యనగర్, తుఫాన్ నగర్‌లలో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో ఇళ్ల యజమానులు ఆస్తి, నీటి పన్ను చెల్లించడం లేదని గుర్తించారు. పెద్దపలకలూరులో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో వర్షం, మురుగునీరు నిలిచి దోమలతో ఇబ్బంది పడుతున్నామని ప్రజల ఫిర్యాదు మేరకు ఆయా స్థల యజమానులకు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, స్పందించని వారి స్థలాల్లో నగరపాలక సంస్థ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్ ఉన్నారు.

టిడ్కో గృహాల్లో యాజమానులే ఉండాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తయిన వారు కేటాయించిన గృహాలలో యాజమానులు ఈ నెల 20వ తేదీలోగా నివాసం ఉండాలని, లేకుంటే కేటాయింపు రద్దు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలోని 7,472 టిడ్కో ప్లాట్లకు గాను 5,052 ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగిందని, వాటిలో కేవలం 1,565 ప్లాట్లలోనే యాజమానులు నివాసం ఉంటున్నారన్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన ప్లాట్లలో తాము నివాసం ఉండకుండా ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని, అద్దెకు ఉంటున్న వారు అసాంఘిక కార్యక్రమాలు చేస్తూ చుట్టుపక్కల నివాసితులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి ప్లాట్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పన్నుల వసూలుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

నెహ్రూ నగర్: నగరంలో సోమవారం నుంచి అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో, అడ్మిన్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ పెంపుపై రెవెన్యూ అధికారులు, అడ్మిన్ కార్యదర్శులు దృష్టిసారించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రవి కిరణ్ రెడ్డి, మదన్ గోపాల్, సాదిక్ బాష, రెహ్మాన్ పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య చిరస్మరణీయుడు



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యశిరీష, ప్రసాద్ లింగం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య చిరస్మరణీయుడిగా నిలిచారని పట్టాభిపురంలోని శాఖా గ్రంథాలయ గ్రేడ్-3 గ్రంథ పాలకురాలు పి.సత్యశిరీష అన్నారు. శనివారం పట్టాభిపురంలోని శాఖా గ్రంథాలయంలో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వీవీ ప్రసాద్ లింగం విద్యార్థులకు మహనీయుల జీవితగాథలతో కూడిన పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జె.వీరారెడ్డి, ఉపాధ్యాయురాలు వి.తనూజ పాల్గొన్నారు.

భారతజాతి ఆత్మ గౌరవానికి ప్రతీక పింగళి

లక్ష్మీపురం: మన జాతీయ జెండా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని దీన్ని రూపొందించిన పింగళి వెంకయ్య భారత జాతి ఆత్మ గౌరవానికి ప్రతీక అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. సీనియర్ ఇంజినీర్ పి.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో పింగళి ఎన్నో ఉద్యమాలు ఆందోళనలో పాల్గొన్నారన్నారు.

నగర వనాన్ని సందర్శించిన చిన్నారులు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాలకు చెందిన ప్రీ-ప్రైమరీ చిన్నారులు శనివారం క్షేత్రస్థాయిలో విజ్ఞానయాత్రగా పేరేచర్లలోని నగరవనాన్ని సందర్శించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రీ-ప్రైమరీ సమన్వయకర్త టి. శ్రీదేవి, ఇన్‌చార్జ్ కే.హరిప్రియ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం డాక్టర్ ద్వారం లక్ష్మి శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. శ్రీదాస సాహిత్య ప్రాజెక్ట్, తీతీదే, శ్రీకంచి కామకోటిపీఠ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం (గుంటూరు), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫైర్ ది ఆర్ట్స్ రీజనల్ సెంటర్ (తిరుపతి), ద్వారం లక్ష్మి అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్(తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ పాలక మండలి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. నారాయణ తీర్థులు ప్రబోధించిన నమ సంప్రయోగ వైభవాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ దీవి నరసింహదీక్షితులు వివరించారు. అనంతరం దీక్షితులను సత్కరించారు. డాక్టర్ లక్ష్మీ అన్నమయ్య, పురందర దాసు, రామదాసు, వెంకట సుబ్బాయర్ వాగ్గేయకారుల రచనలు, రాగం, తానం, పల్లవి గానం చేశారు. వయోలిపై పెరవలి నందకుమార్, మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై శ్రీహరిబాబు వాయిద్యం అందించారు.



జనం నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

- ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి
- రెండు గ్రామాల్లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



చివలూరులో విద్యుత్ వినియోగదారుల నుంచి సంతకాలు సేకరిస్తున్న శివసాంబిరెడ్డి

చివలూరు(కొల్లిపర): రాష్ట్రంలో విద్యుత్ భారం తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన కూటమి ప్రభుత్వం తగ్గించపోగా, భారీగా ఛార్జీలు పెంచి, ప్రజల నడ్డి విరుస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చివలూరు, దావులూరు గ్రామాల్లోని స్మార్ట్ మీటర్ వద్దు, విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని కోరుతూ శనివారం ప్రజల వద్ద నుంచి సంతక సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి విద్యుత్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీలతో వినియోగదారులపై పెరుగుతున్న భారం గురించి వివరిస్తూ సంతకాలు సేకరించారు.

సర్దుబాటు పేరుతో అ'ధన'పు భారం..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకు నాలుగు రకాల సర్దుబాటు చార్జీలు పేరుతో వినియోగదారులపై రూ.15,485 కోట్లు అదనపు భారం వేసిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం దుకాణాలు, చిన్న పరిశ్రమలకు రెండు, మూడు రెట్లు చార్జీలు పెరగటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పాత విద్యుత్ మీటర్లను కొనసాగించాలని, పాత రీడింగ్ పద్ధతిని అమలు చేయాలని, ఇప్పటి వరకు షాపులకు పెట్టిన మీటర్లు తొగించాలని, రానున్న రోజుల్లో గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని వంటి అంశాలపై వినియోగదారుల వద్ద నుంచి సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. భీమిరెడ్డి శివారెడ్డి, జొన్నల ప్రకాశ్‌రెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, బొంతు శంకరరెడ్డి, అవుతు మోహన్‌రెడ్డి, జిలుగు ముక్కంటి, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజీవ్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు

- వియత్నాంలో ఆసియా ఫసిఫిక్ ఆర్థోప్లాస్టీ అంతర్జాతీయ సమావేశం
- ముగింపు వేడుకలో అవార్డు అందుకున్న డాక్టర్ రాజీవ్‌రెడ్డి



అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ కిక్కూరి రాజీవ్‌రెడ్డి

తెనాలి: పట్టణానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యనిపుణుడు డాక్టర్ కిక్కూరి రాజీవ్‌రెడ్డి అంతర్జాతీయ వైద్యుల సమావేశం సమర్పించిన పత్రానికి ఉత్తమ అవార్డు లభించింది. వియత్నాంలో జూలై 30 నుంచి ఆగస్టు 2వ తేదీవరకు ఆసియా ఫసిఫిక్ ఆర్థోప్లాస్టీ కాన్ఫరెన్స్ (ఏపీఏఎస్), వియత్నాం ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సొసైటీ (వీఏఏఎస్) సమావేశాలు వియత్నాంలోని హోచిమిన్ సిటీలో జరిగాయి. ఏడు దేశాల నుంచి వందమందికి పైగా వైద్యనిపుణులు పాల్గొని పత్ర సమర్పణ చేశారు. వీటిలో 'అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ ఫర్ బెటర్ ఔట్‌కమ్' పై డాక్టర్ రాజీవ్ రెడ్డి పత్ర సమర్పణకు శనివారం జరిగిన ముగింపు సభలో ఉత్తమ పత్రంగా అవార్డును, నగదు బహుమతిని అందజేసినట్టు 'సాక్షి'కి సమాచారం తెలియజేశారు. తెనాలిలో వ్యాపార రంగంలో ఉన్న కిక్కూరి శ్రీనివాసరెడ్డి, లలిత దంపతుల కుమారుడు డాక్టర్ రాజీవ్‌రెడ్డి. అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఎంఎస్), కొచ్చిలో ఎంబీబీఎస్ చేశారు. బెల్గాంలోని జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కాలేజీలో ఎంఎస్ (ఆర్థో) చేశారు. అనంతరం తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాదికాలం పనిచేశాక, హైదరాబాద్‌లోని సన్ షైన్ హాస్పిటల్‌లో సూపర్ స్పెషాలిటీలో డాక్టర్ గురవారెడ్డి నేతృత్వంలో శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలో గల కిమ్స్ హాస్పటల్‌లో ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్‌గా చేస్తున్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



మాట్లాడుతున్న సీడీపీఓ విజయగౌరి

తెనాలిఅర్బన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని తెనాలి సీడీపీఓ పి.విజయగౌరి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వలన బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు మొట్టమొదటి వ్యాధినిరోధక టీకాగా పనిచేస్తుందన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన వారి ఇద్దరి మధ్య అనుబంధం పెరుగుతుందని, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యశాల సూపరింటెండెంట్ టి.సౌభాగ్యవాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, స్టాఫ్ నర్సు శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సెంటర్‌లలో ముగిసిన తనిఖీలు



గుంటూరు రమేష్ హాస్పటల్‌లో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరుమెడికల్: సృష్టి ఐవీఎఫ్ సెంటర్ పనితీరుపై ఆరోపణలు వచ్చి, కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఐవీఎఫ్ సెంటర్‌లలో శుక్రవారం నుంచి తనిఖీలు జరుగుతున్నాయి. జిల్లాలో 27 ఐవీఎఫ్ సెంటర్లు ఉండగా, శుక్రవారం 17 సెంటర్లలో తనిఖీలు జరగ్గా, శనివారం పది సెంటర్లలో వైద్యాధికారులు తనిఖీలు చేశారు. గుంటూరు రమేష్ హాస్పటల్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌లో గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ఐవీఎఫ్ సెంటర్లలో డాక్యుమెంట్లు సక్రమంగా నిర్వహణ చేయడం లేదని, సంతానం లేని దంపతులకు చికిత్సలు అందించేందుకు తీసుకునే ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ఉండటం లేదనే విషయాన్ని తాము తనిఖీల్లో గుర్తించినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. రెండురోజుల్లోగా ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టాలని, రికార్డులు సక్రమంగా మెయింటెన్ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

లివర్ సమస్యలను అశ్రద్ధ చేయవద్దు

లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ రజనీకాంత్



మాట్లాడుతున్న డాక్టర్ సుందరాచారి, పక్కన డాక్టర్ యశస్వి రమణ, డాక్టర్ కవిత, డాక్టర్ రజనీకాంత్

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలితో లివర్ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని చెన్నై గ్లోబల్ హాస్పటల్‌కు చెందిన లివర్‌ట్రాన్స్‌ప్లాంట్‌సర్జన్, గుంటూరు వైద్య కళాశాల 1991 బ్యాచ్ వైద్య విద్యార్థి డాక్టర్ రజనీకాంత్ అన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సులో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ రెండు నెలల్లో జీజీహెచ్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలు ప్రారంభించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి మాట్లాడుతూ లివర్ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో చేయటం వల్ల వైద్య విద్యార్థులకు నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చాలా ఖరీదుతో కూడుకున్నదని చెప్పారు. అమెరికాలో లివర్ మార్పిడి ఆపరేషన్‌కు రెండుకోట్లు ఖర్చు అవుతుందని, యూకేలో 1.5 కోట్లు ఖర్చు అవుతుందని వెల్లడించారు.

పెళ్లికి ముందు హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి

గుంటూరు మెడికల్: పెళ్లికి ముందు హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి చేయాలని, దీనికి ప్రత్యేకంగా ఒక చట్టం తీసుకొని రావాలని నేషనల్ లివర్ అండ్ గ్యాస్ట్రో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.షేక్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీనిపై దృష్టి సారించాలని కోరారు. శనివారం ఆర్.అగ్రహారంలోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు.

సిస్టర్స్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెహ్రూనగర్: నన్స్‌పై చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో అన్యాయంగా అరెస్టు చేసి వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జయసుధ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు సిస్టర్లు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఓ ఆస్పత్రిలో గిరిజన యువతులకు ఉద్యోగాలు ఇప్పించేందుకు తీసుకుని వెళుతున్న సమయంలో భజరంగ్‌దళ్ కార్యకర్తల తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు.